క్లుప్తంగా

గీతం విద్యార్థులకు బహుమతి



బహుమతితో విద్యార్థి, తదితరులు

కొమ్మాది: అపోలో టైర్స్ సంస్థ ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన పర్యావరణ పోటీల్లో గీతం విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో పర్యావరణ శాస్త్రంలో బీఎస్సీ డిగ్రీ అభ్యసిస్తున్న విద్యార్థులు కె.దేవిశ్రీ కళ్యాణ్, రామాయణం దూలే ప్రతిభ కనపరచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని ప్రొఫెసర్ సురేష్ కుమార్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ సమావేశం నేడు

పద్మనాభం: భీమునిపట్నం నియోజకవర్గంలో ఈ నెల 27న నిర్వహించనున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి బుధవారం పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. పార్టీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ ఆధ్వర్యంలో ఉదయం పది గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కన్వీనర్లు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి



వెంకటేష్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఆనందపురం : అనుకున్న లక్ష్యాలు సాధించాలంటే నిరంతరం శ్రమించాలని ఇటీవల ఎస్ఐ పోస్టుకు ఎంపికైన తోమురోతు వెంకటేష్ సూచించారు. ఆనందపురం గాయత్రి కళాశాల పూర్వ విద్యార్థి వెంకటేష్‌ను మంగళవారం కళాశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని సాధారణ పాఠశాలలో చదువుకున్న తాను ఎస్ఐగా ఎంపిక కావడానికి నిరంతరం శ్రమించానని చెప్పారు. యువత విద్యార్థి దశలోనే మంచి లక్షణాలను అలవర్చుకొని ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ బెల్లాన రామకృష్ణ, ప్రిన్సిపాల్ దుక్క అప్పలరాజు, కరస్పాండెంట్ యర్రాజీ వెంకటరావు, అధ్యాపక బృందం వెంకటేష్‌ను అభినందించి ఆయనను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

నైతిక విలువలు బోధించే నాయకత్వం అవసరం



గాంధీజీ చిత్రపటం వద్ద అతిథులు

ఏయూ క్యాంపస్: నైతిక విలువలు బోధించే నాయకత్వం కోసం యువత ఎదురుచూస్తోందని ఏయూ న్యాయ కళాశాల పూర్వ ఆచార్యుడు, డీఎస్ఎన్ఎల్‌యూ పూర్వ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ అన్నారు. ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గాంధీజీ–జాతీయ సమైక్యత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతీ పౌరుడు బాధ్యతలు కలిగి ఉండాలన్నారు. ముందుగా మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక అతిథి విజయ విహారం రమణమూర్తి మాట్లాడుతూ సంఘర్షణలు పరిష్కరించడానికి గాంధీజీ ఆలోచనలు ఉపకరించే విధానాలు వివరించారు. ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎం.శ్యామ్ ప్రసాద్, విశాఖ స్టీల్ ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ పి.కిషోర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వల్లే సమసమాజ స్థాపన

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని ఎంతో గొప్పగా రచించడం వల్లే అందరికీ ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన సామాజిక సంకల్ప కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో నివసించే ప్రతి ఒక్కరికీ తారతమ్యాలు లేకుండా ఒకే విధమైన హక్కులు కల్పించేలా ఆయన రాజ్యాంగాన్ని అందించారని కొనియాడారు.

అందువల్లే ప్రపంచంలోనే మరెక్కడా లేని విధంగా మన దేశంలో అందరూ అన్ని హక్కులూ పొందుతున్నారన్నారు. అంతటి మహానుభావుడి గొప్పదనాన్ని ఎప్పటికీ అందరూ గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం ఇదే ఆవరణలో ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, జిల్లా రైతు సలహా సంఘం అధ్యక్షులు దాట్ల పెదబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు యలమంచిలి సూర్యనారాయణ, ఎంపీడీవో డాక్టర్ వి.జానకి పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



చామంతులు, బంతిపూల అలంకరణలో రాస పోలమాంబ



బిస్కెట్లతో అలంకరణలో తాటితూరు పైడితల్లమ్మ



ఐదు రకాల చామంతుల అలంకరణలో కొత్తమ్మతల్లి

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో అయిదు రకాల చామంతులతో అలంకరించారు. ఈ అలంకరణకు ఆదర్శనగర్‌కు చెందిన మొక్క అప్పలరెడ్డి, వెంకటలక్ష్మి దంపతులు సహాయ సహకారాలు అందించారు. అమ్మవారిని భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు అలంకరించారు.

- భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబను చామంతులు, బంతిపూలతో అలంకరించారు. ఈ అలంకరణకు సరగడ సూరి, సూరమ్మ దంపతులు సహకరించగా తుపాకుల అప్పలరాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.
- భీమిలి మండలం తాటితూరు గ్రామదేవత పైడితల్లమ్మను బిస్కట్లతో వేమన రెడ్డి సంఘం సహకారంతో అలంకరించారు. ఈ అలంకరణను వేణురెడ్డి, హేమంత్‌రెడ్డి, సాయిరెడ్డి పూర్తి చేశారు.

భీమిలి నియోజకవర్గ ఓటర్లు 3,51,462



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

సమావేశంలో ఆర్డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి నియోజవర్గ పరిధిలో జిల్లాలోనే అత్యధిక ఓటర్లు ఉన్నారని ఆర్డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇప్పటి వరకు ఓటర్ల జాబితా విడుదల చేశామని, దాని ప్రకారం నియోజకవర్గంలో అత్యధికంగా 3.51 లక్షల 462 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇంకా కొత్తగా వచ్చే వారికి ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అభ్యర్థులు నామినేషన్లు వేసే ఆఖరు రోజు వరకు అవకాశం ఉంటుందని, ఆ మేరకు వారు నమోదు చేసుకోవచ్చని సూచించారు. అలాగే ఇప్పుడున్న ఓటర్ల జాబితాలను పార్టీల నాయకులు పరిశీలించుకోవాలని, వాటిల్లో ఏమైనా పొరపాట్లు ఉన్నట్టు గుర్తించి తమకు తెలిపితే సరిచేస్తామన్నారు. అదేవిధంగా అన్ని ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌ల విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఆయా చోట్ల అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. దాంతోపాటు వృద్ధులు, వికలాంగులకు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నాయకులు గాడు శ్రీను, గంటా నూకరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వ కృషి భేష్



మాట్లాడుతున్న నాగమణి

తగరపువలస: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి బాగుందని భీమిలి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి నాగోతు నాగమణి అన్నారు. మంగళవారం ఆమె బాలాజీనగర్, కొండపేట గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతూ తాను గెలిస్తే విద్యాభివృద్ధికి మరికొన్ని సంస్కరణలు తీసుకొస్తానన్నారు. వీటిని ఈ నెల 26న వెల్లడిస్తానన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆమెతోపాటు బివర వెంకటరమణ, నాగోతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ సతీష్ ప్రతిభ



తగరపువలస: ఈ నెల 19 నుంచి 21 వరకు తమిళనాడు కిక్ బాక్సింగ్, వాకో ఇండియా ఆధ్వర్యంలో ఆ రాష్ట్రంలోని పెరియామెట్ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన తమిళనాడు ఛాంపియన్‌షిప్ – 2024 పోటీల్లో సంగివలసకు చెందిన ఎంవీ పవన్ సతీష్ ప్రథమ స్థానంలో నిలిచి టైటిల్ గెలుచుకున్నాడు. నగరంలోని డాక్టర్ ఎలైట్ డయాగ్నిస్టిక్స్ రేడియాలజీ విభాగంలో టైపిస్ట్‌గా పనిచేస్తున్న పవన్ సతీష్ ఇప్పటికే మూడుసార్లు జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. మరోమారు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ట్రోఫీ, పతకం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పవన్‌ను ఎలైట్ యాజమాన్యం, అకాడమీ ప్రతినిధులు అభినందించారు.

అభివృద్ధి ప్రణాళికలతో సకాలంలో పనులు



మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

భీమునిపట్నం: భీమిలి మండల పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి అభివృద్ధి ప్రణాళికను రూపొందించడం ద్వారా అనుకున్న మేరకు సకాలంలో పనులన్నీ పూర్తవుతాయని ఎంపీపీ దంతులూరి వాసురాజు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరికీ అవసరమైన తాగునీరు, కాలువలు, విద్య, ఆరోగ్యం, వైద్యంతోపాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఎక్కడ, ఏ మేరకు అందివ్వాలన్న వాటిపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి కమిటీలు వేస్తామని, ఆ మేరకు వారికి కేటాయించిన పనులను పూర్తి చేస్తారన్నారు. అధికారులు అన్ని పనులను జాగ్రత్తగా పర్యవేక్షించాలన్నారు. 4వ వార్డు కార్పొరేటర్ దౌలిపల్లి కొండబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఎంపీడీవో డాక్టర్ జానకి, అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ బాధ్యత డ్రైవర్లదే



మాట్లాడుతున్న ఎంవీ ఇన్‌స్పెక్టర్ బాలాజీరావు

తగరపువలస: రహదారులపై ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందుచూపుతో ఆటో, మోటారు కార్మికులు వ్యవహరించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు బి.బాలాజీరావు, బి.రాజారావు సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పెట్రోల్ బంక్ ఆవరణలో మంగళవారం వారు మాట్లాడారు. అనుకోకుండా ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో సమీపంలోని ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ఇందుకోసం అంబులెన్స్‌ల కోసం వేచి ఉండటం వల్ల బాధితుల పరిస్థితి విషమించే ప్రమాదం ఉందన్నారు. నిర్ణీత సమయం ప్రకారం కార్మికులు తమ వాహనాలను తనిఖీ చేసుకోవాలన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాలు ప్రమాదాలకు గురైతే మృతుల కుటుంబాలకు బీమా కొండంత అండగా నిలుస్తుందన్నారు. అదే సమయంలో వాహనాల కాలుష్యానికి సంబంధించిన సర్టిఫికెట్లు కూడా అవసరమన్నారు. ముందుగా బయలుదేరి వాహనాల వేగాన్ని తగ్గిస్తే సురక్షిత ప్రయాణానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం డ్రైవర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ది తగరపువలస శ్రీకనకదుర్గ మ్యాక్సీ క్యాబ్ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుజ్జు సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జీరు ఎర్రయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



భీమిలిలో ట్యాబ్‌లతో విద్యార్థులు



తాళ్లవలస జెడ్పీ హైస్కూల్‌లో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ

భీమునిపట్నం: స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ఉన్న 18 ట్యాబ్‌లను ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సింహాచలం మంగళవారం అందించారు. ప్రభుత్వం అందించిన ఈ చక్కని అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు అల్లాడి శ్రీనివాసరావు, సుజాతకుమారి, వెంకటరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జెడ్పీ హైస్కూల్‌లో ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ 8వ తరగతి చదువుతున్న 64 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని వివరించారు. సర్పంచ్ బోనిల జగ్గమ్మ, సన్నిబాబు, అక్కరమాని రమణ, మన్యాల జ్యోతి, ప్రధానోపాధ్యాయుడు కె.ప్రభాకరరావు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో కార్పొరేట్ వైద్యం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు ఆదినారాయణ, ఈశ్వరరావు



ఆరోగ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

పద్మనాభం: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నట్టు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్య నిపుణులతో పరీక్షలు చేయించి, రోగులకు అవసరమైన మందులు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. అవసరమైన వారు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. శిబిరంలో 521 మంది రోగులను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరరావు, వైద్యాధికారి స్వప్న, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయండి



సంతపేటలో మాట్లాడుతున్న శిల్లా సరళారాణి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పీకేఎం పాత్రుడు

తగరపువలస: సంగివలసలో ఈ నెల 27న నిర్వహించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ జీవీఎంసీ 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి కోరారు. మంగళవారం సంతపేట కల్యాణ మండపంలో ఆమె నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ సభ ద్వారా సీఎం జగన్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారని తెలిపారు. అనంతరం ఎస్.కరుణాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, శిష్టకరణాల సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి మాట్లాడారు. సమావేశంలో పీతల వెంకట అప్పారావు, చిల్ల సూర్యనారాయణ, చిల్ల ప్రమీల, మద్ది మహాలక్ష్మి, కొండపు సూరిబాబు, చేట్ల ఎల్లయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 27న నిర్వహించనున్న భారీ బహిరంగ సభ జయప్రదానికి ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పిళ్లా సూరిబాబులు పిలుపునిచ్చారు. మంగళవారం చంద్రంపాలెం ద్రోణంరాజు సత్యనారాయణ కళ్యాణ మండపంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ విజయవంతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, వార్డు జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, నాయకులు పెంద్ర అప్పన్న, చేకూరి రజని, జగ్గపిల్లి నరేష్, అల్లాడ ఎర్రిబాబు, మగ్గూరి వెంకరమణ, రామిరెడ్డి పాల్గొన్నారు.

నేతాజీ త్యాగం నేటి తరాలకు ఆదర్శం



భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు



బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు



కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు



సుభాష్‌చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చంద్రంపాలెం బాపూజీ కళా మందిరం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: సాయుధ పోరాటం ద్వారా స్వరాజ్యం సాధించవచ్చని నమ్మిన వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. మంగళవారం చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన గురించి విద్యార్థులకు వివరించారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించి జపాన్ ప్రభుత్వం అందించిన ఆర్థిక, సైనిక, దౌత్య సాయంతో అజాద్ హింద్ ఫౌజ్ ప్రభుత్వాన్ని సింగపూర్‌లో ఏర్పాటు చేశారన్నారు. తన జీవిత కాలంలో 11 సార్లు జైలుకు వెళ్లిన ఆయన 24 ఏళ్ల వయసులో ఐపీఎస్ ఉత్తీర్ణత సాధించారన్నారు. భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్. కృష్ణారావు ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. భీమిలి మండలం కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు జి.సత్యనారాయణ, విద్యార్థులు నివాళులర్పించారు. విద్యారులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

మధురవాడ: భారత స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రభోష్ విశేషమైన పాత్ర పోషించారని, ఆయన త్యాగం నేటి తరాలకు ఆదర్శం కావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద నేతాజీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జీవీఎంసీ 6, 7 వార్డుల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం మాట్లాడుతూ భరతమాత స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాన్ని కొనియాడారు. సింహాచలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, జిల్లా నాయకులు పిళ్లా సూరిబాబు, 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు మాట్లాడుతూ అజాద్ హింద్ ఫౌజ్ సైన్యాన్ని స్థాపించి బ్రిటిష్ పాలకులను దేశం నుంచి తరిమి వేయడానికి అనేక పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో పీవీజీ అప్పారావు, కుడితి రామారావు, పోతిన పైడిరాజు, పిళ్లా వెంకటరమణ, తమ్మినేని వరలక్ష్మి, బెల్లాపు పాపారావు, పిళ్లా అప్పన్న, పీస రామారావు, మగ్గూరి వెంకటరమణ, పిళ్లా రమణ, సియాద్రి కనకరాజు, కొండపల్లి వరలక్ష్మి, అనూష, సురేష్, జామి శివ, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

భీమునిపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి ఆర్.ప్రభాకర్ నాయుడు, నాయకులు కె.సూరిబాబు, ముక్కి కృష్ణ, సన్యాసిరావు, ప్రగడ చంటి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

స్మార్ట్ విజన్ గ్లాసెస్ పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ప్రభుత్వ అంధ బాలికల పాఠశాలలో మంగళవారం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, రోటరీ క్లబ్ మద్రాస్ ఈస్ట్ సహకారంతో విద్యార్థినులకు పవర్ స్మార్ట్ విజన్ గ్లాసెస్‌ను అందజేశారు. ఈ స్మార్ట్ విజన్ గ్లాసెస్ మొబైల్ ఫోన్‌కు అనుసంధానమవుతాయని, అంధులు తమ ముందున్న వస్తువులను గుర్తించడానికి, దృశ్యాన్ని వివరించడానికి, వారి ముందున్న వ్యక్తులను గుర్తించడానికి, పుస్తకాలు సులభంగా చదవడానికి ఇవి సహాయపడతాయని రోటరీ క్లబ్ మద్రాస్ ఈస్ట్ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సభ్యులు అభిషేక్, రామకృష్ణను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తిరుమల ప్రసాద్, సూపరింటెండెంట్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.